కేదారీఘాట్ రేవులు అస్తవ్యస్తం

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరున్న సిద్ధాంతం కేదారీ ఘాట్ రేవులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. గోదావరి పెరుగుతూ తగ్గుతూ ఉండడంతో రేవులన్నీ పూర్తిగా బురదమయంగా మారాయి. కేదారీఘాట్‌లో మూడు పుష్కర రేవులు ఉన్నాయి. వీటిలో ఒకదానిని పిండ ప్రధానాల రేవుగా వినియోగించుకుంటూ ఉంటారు. కేదారేశ్వరుడు కొలువై గోదావరీ తీరం పవిత్ర స్థలంగా పేర్గాంచడంతో నిత్యం భక్తులు భారీగా పుణ్య స్నానాలకు వస్తుంటారు. అదేవిధంగా పరిసర గ్రామాల నుంచి అంత్యక్రియలకు మృతదేహాలను తీసుకువచ్చి ఆఖరి మజిలికి దక్షిణ కాశీ శ్మశాన వాటికను వినియోగిస్తారు. వీరి వెంట వచ్చే వారందరూ స్నానాలు ఆచరిస్తుంటారు. అదేవిధంగా అపరకర్మలను సైతం కేదారీఘాట్ వద్ద నిర్వహిస్తారు. నిత్యం రెండు నుంచి మూడు మృతదేహాలు అంత్యక్రియలకు తీసుకువస్తారు. వాటి కూడా కనీసం 200 లకు పైగా బంధుమిత్రులు వస్తుంటారు. వీరంతా ఇదే రేవుల్లో స్నానాలు చేస్తారు.


బురదతో సిద్ధాంతం కేదారీఘాట్ రేవు

దుర్భరంగా పిండ ప్రదానాల రేవు

పిండ ప్రదానాల రేవు దుర్భరంగా ఉంది. రేవులో దిగాలంటే చాలు ఒళ్లు ఝులదరిస్తుంది. మృతదేహాల దహన సంస్కారాల అనంతరం మిగిలి ఉన్న ఎముకల వ్యర్థాలను, పుల్లల వ్యర్థాలను ఈ రేవులోనే కలుపుతారు. దీంతో పాటు, పిండాలను వదులుతుంటారు. దీంతో సాధారణంగానే పిండ ప్రధానాల రేవు అస్తవ్యస్తంగా ఉంటుంది. గోదావరి వరద బురదతో మరింత దుర్భరంగా మారింది. అధికారులు స్పందించి పుష్కర రేవులను, పిండ ప్రధానాల రేవునుశుభ్ర పరచి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

వరదతో ఇబ్బందులు

గత రెండు మూడు నెలలుగా గోదావరికి వరద వస్తుండడం, తగ్గుతుండడంతో వరద నీటితో పాటు వచ్చే బురద రేవుల్లో నిలిచిపోయింది. దీంతో బురదలో స్నానాలు చేయడానికి రేవుల్లో దిగుతూ జారి పడిపోతున్నారు. అదేవిధంగా, ప్రస్తుతం గణపతి నవరాత్రులు పూర్తి కావడంతో పరిసర గ్రామాల నుంచి పదుల సంఖ్యలో గణపతి ప్రతిమలను తీసుకు వచ్చి కేదారీఘాట్ పుష్కర రేవుల్లో నిమజ్జనం చేశారు. వీటి వ్యర్థాలతో రేవులన్నీ నిండిపోయాయి. ఇనుప ఊచలు, గెడ బద్దలతో పాటు, పీఓపీ వ్యర్థాలు రేవుల్లోనే ఉండిపోయాయి. దీంతో స్నానాలకు వచ్చినవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలపాలవడం ఖాయంగా కనిపిస్తుంది.


పీఓపీ వ్యర్థాలతో నిండిన సిద్ధాంతం పుష్కర రేవు


దుర్భరంగా పిండ ప్రదానాల రేవు

క్లుప్తంగా

బాడవ ఉపాధ్యాయుడికి జిల్లా అవార్డు


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న అడబాల వెంకటేశ్వరరావు

యలమంచిలి: బాడవ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అడబాల వెంకటేశ్వరరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా వెంకటేశ్వరరావు అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ నరసింహారావు, బాడవ సర్పంచ్ రాయి వెంకట కనక దుర్గ తదితరులు అభినందించారు.

వృద్ధురాలి కడుపులో ఐదు కిలోల కణితి తొలగింపు


కణితిని చూపుతున్న సౌమ్య హాస్పటల్ వైద్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని సౌమ్య ఆస్పత్రిలో ఓ వృద్ధురాలికి శస్త్ర చికిత్స చేసి ఐదు కిలోల కణితిని తొలగించారు. వివరాల ప్రకారం పోడూరు మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన కడియం సీతామహాలక్ష్మి (85) కడుపు నొప్పి, కడుపు ఉబ్బరంగా ఉండడంతో స్కాన్ చేయించగా కడుపులో ఐదు కిలోల గడ్డ ఉందని తేలింది. దీంతో ఆమెకి ఆసుపత్రి చైర్మన్ జీఎస్ఎల్ రాజశేఖర్ పర్యవేక్షణలో లాప్రోస్కోపిక్ సర్జన్ లంకలపల్లి గోకుల్‌కుమార్, గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మీ విజయవంతంగా శస్త్రచికిత్స చేసి గడ్డను బయటకు తీసి ఆమెను కాపాడారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

పెనుమంట్ర: పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోరాడాలని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ అన్నారు. శుక్రవారం మార్టేరు రోటరీ భవన్లో మండల పెన్షన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సంఘ గౌరవ అధ్యక్షులు తామాడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్ఎస్ జీవితం ఆదర్శనీయం


ఆచంటలో ఆర్ఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: ఆర్ఎస్ జీవితం నేటి యువతరానికి ఆదర్శనీయమని సీపీఎం ఆచంట మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఆచంటలో సీపీఎం నాయకుడు రుద్రరాజు సత్యనారాయణ(ఆర్ఎస్) చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజా సంఘాలు అధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కార్మిక ఉద్యమ నేత కామ్రేడ్ ఆర్.సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) ఆశయాలు ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు ఘనమైన నివాళి అని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆర్ఎస్ రాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దోమల నివారణపై అవగాహన


ఉండిలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉండి: ఖాళీ ప్రదేశాల్లో, వివిధ వస్తువుల్లోనూ నిల్వ ఉండే నీటిలో దోమలు పెరుగుతాయని వాటివల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని జిల్లా వైద్య కార్యాలయ అధికారులు ఆరిమిల్లి ఎస్ఎస్ఎన్ మూర్తి,రమేష్‌వర్మ అన్నారు. స్థానిక జంగాల కాలనీలో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు మాట్లాడుతూ వాడకం నీరు, వర్షపు నీరు వంటివి గుంటల్లోను, ఖాళీ ప్రదేశాల్లో ఏవైనా వస్తువుల్లోను నిల్వ ఉంటే మనకెందుకులే అనుకుంటాం కానీ వాటిలో దోమలు పెరగడంతో పరిసరాల పరిశుభ్రతకు తీవ్ర విఘాతం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆర్ కృష్ణకుమార్, వెంకటేశ్వర్లు, పి. జ్ఞాన రాజు, అనూష, లక్ష్మీ, సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

పాలకొల్లు సెంట్రల్: రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని సొసైటీ అధ్యక్షుడు వడ్డే సోమ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో సొసైటీ రుణాలను చెల్లించారు. ఈ సందర్భంగా సోమ చంద్రశేఖర్ మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లిస్తే రాయితీ సొమ్ము వెంటనే అందిస్తారన్నారు. కార్యక్రమంలో దండు కాశీ రాజు, పంచదార వెంకట రంగారావు, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

పెనుగొండ: పేదలకు ఉచితంగా అందించాల్సిన ఇసుకతో ఆచంట నియోజకవర్గంలో అక్రమదందా చేస్తున్న ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోతుమూడి రామచంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ దందాకు పాల్పడుతున్న కూటమి నాయకుడు రాంబాబుపై ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు, విజిలెన్స్ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ వర్గాలపై అధికారంతో పెత్తనం చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. అధికారం ఎపుడూ శాశ్వతం కాదన్నారు. త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు,ప్రజా ప్రతినిధుల జోలికొస్తే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో ప్రతిఘటిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గొట్టుముక్కల ఏసురత్నం, గుబ్బల వీర బ్రహ్మం గుడాల చంటి, దొంగ దుర్గా ప్రసాద్, పెచ్చెట్టి సత్యనారాయణ, జక్కంశెట్టి చంటి, దొమ్మేటి రాంబాబు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, ఏనుగుపల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తూర్పుపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

శాసనమండలిలో ప్రస్తావించాలి

ఆచంట నియోజకవర్గంలో కూటమి నాయకుడు చేస్తున్న అక్రమ ఇసుక దందాపై రాబోయే సమావేశాల్లో శాసన మండలిలో ప్రస్తావించాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అక్రమదందాపై చర్యలు తీసుకునేలా పోరాడతానని కవురు తెలిపారు.

నేటితో ముగియనున్న గణపతి నిమజ్జనాలు

పెనుగొండ: చంద్రగ్రహణంతో వినాయక చవితి ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. పూజలందుకొన్న గణనాథులను శనివారం నిమజ్జనం చేయడానికి పెనుగొండలో ప్రధాన వర్గాలు సన్నద్ధం అవుతున్నాయి. దీంతో గ్రామంలో నిమజ్జనాలపై ఉత్కంఠ నెలకొంది.పెనుగొండలో 15 రోజుల నుంచి 20 రోజుల వరకూ చవితి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నాయి. గతంలో నిమజ్జన ఉత్సవాల్లో వర్గ వైషమ్యాలు చెలరేగడంతో దశాబ్దాలుగా నిమజ్జనోత్సవాలు విడివిడిగా ప్రధాన వర్గాలు ఒకరికి ఒకరు ఎదురు వచ్చే విధంగా నిర్వహించకుండా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నారు. అయితే ఈ ఏడాది చంద్రగ్రహణం కారణంగా పెనుగొండలో సుమారు పదికి పైగా గణేష్ ప్రతిమలకు శనివారం నిమజ్జనం నిర్వహించనున్నారు. రెండు మూడు వర్గాలు నిమజ్జనాలు ఎప్పుడూ పోటాపోటీగా నిర్వహిస్తుంటారు. ఈ కోవలో విడివిడి రోజుల్లో నిర్వహించినా ప్రతిఏటా చిన్నపాటి గలాటాలు జరగడం పరిపాటిగా మారింది. దీంతో ఇటు పోలీసులకు, అటు ఆయా వర్గాల నాయకులకు, పెద్దలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యేవి. అయితే ఈ ఏడాది ఆయా వర్గాలు చంద్రగ్రహణం కారణంతో ఒకే రోజు నిమజ్జనానికి సన్నద్ధం అవుతున్నాయి. దీని వల్ల ఒకరికి ఒకరు ఎదురైనా, ఒకే ప్రాంతంలో ఒకరి వెనుక ఒకరు వచ్చినా యువతలో ఉన్న పొరపొచ్చాలతో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందంటూ ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పోలీసులు నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై హెచ్చరికలు చేశారు. గ్రామోత్సవం, నిమజ్జనోత్సవం ముగిసేవరకూ గ్రామంలో ఉత్కంఠ తప్పదంటూ గ్రామస్తులు బావిస్తున్నారు.


పెనుగొండలో పూజలందుకొంటున్న గణనాథుడు

ఘనంగా గురుపూజోత్సవం


పెనుగొండ: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మానవత సభ్యులు


పాలకొల్లు సెంట్రల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలు, పాఠశాలల్లో వేడుకను ఘనంగా నిర్వహించి గురువులను సత్కరించారు. వైఎన్ కళాశాలలో కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్, బీజీబీఎస్ మహిళా కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకను నిర్వహించారు. అధ్యాపకులను సత్కరించారు. శ్రీసూర్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీహరిపేటలో వేడుకను ఘనంగా నిర్వహించి గురువులను సత్కరించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డీఓ దాసి రాజు, పాఠశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువులను ఘనంగా సత్కరించారు. మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండు వెంకటేశ్వరరావు, మానేపల్లి పద్మజ, కార్మూరి సుజాత తదితరులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వాసవిక్లబ్, వాసవి వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కంచర్ల సోని, వనిత క్లబ్ అధ్యక్షురాలు కంచర్ల వెంకటలక్ష్మి, సిరం తులసి, కోట్ల పద్మ, కోట్ల సుధాకర్, శిరం శ్రీను, లక్కింశెట్టి కష్ణమూర్తి పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: బిడ్డను లోకానికి పరిచయం చేసేది, నడక, నడవడిక నేర్పేది తల్లి దండ్రులైతే విద్యా బుద్ధులు నేర్పి సమాజాభివృద్ధికి కృషి చేసేది ఉపాధ్యాయుడేనని లయన్స్ థర్డ్ ఇంటర్నేషనర్ వైస్ ప్రెసిడెంట్ వి.విజయకుమార్ రాజు అన్నారు. గురువారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాచకొండ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయు లు వై.ప్రభాకరశాస్త్రి, ఏవీవీ సత్యనారాయణ, సిర్రా ఝాన్సీలక్ష్మీబాయ్, చామకూరి ప్రభావతి, పడాల పల్లపు రాజకుమార్, దువ్వాని ఏసుబాబు, ఉపాధ్యాయులు పీవీఆర్ వేణుగోపాలాచారి, లిఖితపూడి బిజిలికుమారి, పోలుకొండ వేణుగోపాలరావు, గుణ్ణం శ్రీనివాస్, పిండి రామచంద్రరావు లను ఘనంగా సన్మానించారు. నందుల సీతారామారావు, క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీష్, సెక్రటరీ దోనెల ప్రసాద్, ట్రెజరర్ దేవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మామిడిగుంట ఎంపీపీ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సీహెచ్ పద్మావతి, నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు వై.వెంకన్న, కె.మురళీకృష్ణ, జి.రవికుమార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్టిన్, పెదపాటి శ్యాంబాబు, వర్ధనపు ప్రవీణ్, కె కుమార్, బేబి సరోజని తదితరులు పాల్గొన్నారు.అలాగే స్థానిక రోటరీ అసోసియేషన్ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.తులసి ప్రదీప్, షేక్ వాహెదున్నీసా, బి.శైలజ, పి.లక్ష్మీ నారాయణ, బాలం సుబ్రహ్మణ్యంలకు నేషన్ బిల్డర్ అవార్డులు ప్రధానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కోసూరు రామకృష్ణ ఆనందరాజు, అసిస్టెంట్ గవర్నర్ రావూరి అప్పారావు, క్లబ్ కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: సమాజాభివృద్ధికి సేవలందించే అదృష్టం ఉపాధ్యాయులకే దక్కుతుందని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెనుగొండ రెడ్డి కల్యాణ మండపంలలో మానవత ఆధ్వర్యంలో 60 మందికి ఉత్తం ఉపాధ్యాయ పురస్కారం అందించి సామూహిక సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, షేక్ మస్తాన్, కర్రి నరేంద్ర రెడ్డి, నేమాని శ్రీనివాస్ నూలి నవీన్, యలమర్తి నరసింహరావు, టీవీకే రంగారెడ్డిలు పాల్గొన్నారు.

ఎస్వీకేపీలో

గురువులు నిర్మలమైన శాంతమైన, మిత భాషణ నైపుణ్యం కలిగి రాగ ద్వేషాలకు అతీతంగా గురుస్థానానికి గౌరవం పెంచే విధంగా ఉండాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ సాధికారికత అధికారి డి శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో పెనుగొండలో అంగన్ వాడీలను ఘనంగా సత్కరించారు.


నరసాపురం: సూర్యా కళాశాలలో గురువులను సత్కరిస్తున్న దృశ్యం


నరసాపురం రూరల్: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు


పాలకొల్లు సెంట్రల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు పాలకవర్గ సభ్యులు


పెనుగొండ: ఎస్వీకేపీలో కళాశాలలో అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

ఈ–పంట నమోదు వేగవంతం చేయాలి

ఉండి: ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహూల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం యండగండిలో ఈ–పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయనే స్వయంగా నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 10500 ఎకరాలకుగాను ఇప్పటి వరకు 9500 ఎకరాల ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసారని మిగిలిన 1500 ఎకరాలను త్వరలోనే పూర్తి చేసి నూటికి నూరుశాతం పూర్తి చేయాలన్నారు.అలాగే రైతులంతా తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ, ఇతర పథకాలకు అర్హులు కారని సూచించారు. అలాగే అన్ని ల్యాండ్ పార్సెల్స్‌కి సంబంధించిన డేటాను డిజిటల్ క్రాఫ్ సర్వే(డీసీఎస్)లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస్, ఏఈఓ పరంజ్యోతి, ఊర్మిళ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


యండగండిలో ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ రాహూల్‌కుమార్‌రెడ్డి

